# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY


సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 302 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | బుధవారం 10 జులై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

# మళ్లీ టీఆర్ఎస్! బీఆర్ఎస్ నేమ్ చేంజ్

- మనసు మార్చుకున్నమాజీ సీఎం కేసీఆర్?
- ప్రజలతో గ్యాప్ వచ్చిందంటున్న కేటీఆర్
- వరుస వలసలతో సెంటిమెంట్ రాజేసే యత్నం
- కొత్త స్కెచ్ కు తెరలేపిన కారు పార్టీ



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ రాజకీయాలంటూ పార్టీ పేరు మార్చుకొని బీఆర్ఎస్ గా మారిన గులాబీ పార్టీ పీఛేముడ్ అననుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పేరిట ఎన్నికలకు వెళ్లిన బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. 39 ఎమ్మెల్యే సీట్లు గెలిచి ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఓటమి.. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు చెందిన శ్రీగణేశ్ గెలుపుతో.. బీఆర్ఎస్ బలం కాస్తా.. 38కి పడిపోయింది. తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడం 15 చోట్ల మూడోస్థానానికి పడిపోవడం.. చాలా స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో కారు పార్టీ ఉక్కిరి బిక్కిరయ్యింది. గెలిచిన ఎమ్మెల్యేల్లో ఇప్పటి వరకు ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా హస్తం పార్టీలో చేరారు. వరుస వలసలు గులాబీ అధినేతకు కంటిమీద కనుకు లేకుండా చేస్తున్నాయి. ఇవాళ తనతో సమావేశానికి హాజరైన వారు తెల్లారేసరికి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతుండడాన్ని గులాబీ బాస్ జీర్ణించుకోలేక పోతున్నారట. దాదాపు రెండు

వివరాలు 2లో..

## ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఇంకా కుట్రలు చేస్తున్నారు



- బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని మండిపాటు
- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని వెల్లడి
- పార్టీ కోసం కష్టపడేవారికి పదవులు ఇవ్వాలని వ్యాఖ్య
- కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ఉసురు తగిలిందన్న రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోలేదా? అని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొంతమంది నాయకులు ఇంకా కాంగ్రెస్ పడిపోవాలని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే... కూలిపోతుందని కేసీఆర్ అనలేదా? అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్‌లోని ఏఎస్ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల సభలో సీఎం మాట్లాడుతూ...

వివరాలు 2లో..

## త్వరలో కాంగ్రెస్‌లోకి 20 మంది ఎమ్మెల్యేలు



రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఎల్పీ విలీనం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో మరో 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరబోతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చెప్పారు. రా బోయే రోజుల్లో బీఆర్ఎస్ ఎల్పీ కూడా కాంగ్రెస్ లో విలీనం అవుతుందని అన్నారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాపాలను బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోతున్నారని చెప్పారు. గల్లీలో ఉండాల్సిన కేటీఆర్, హరీశ్ రావు ఢిల్లీలో ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలను కాపాడుకోలేక తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ కు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వలేదని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. కేసీఆర్ తెలంగాణ సంపదను దోచుకున్నారని ఆరోపించారు.

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువా కప్పుతున్నాడు

- పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ అని విమర్శ
- ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినతరం చేస్తామని గాలికి వదిలేసిందని ఆగ్రహం
- దానం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని వెల్లడి
- అనర్హత వేటు పడేలా చట్టం తెస్తామని వారే ఫిరాయింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం
- ఫిరాయింపులపై రాష్ట్రపతి, స్పీకర్‌ను కలుస్తామన్న కేటీఆర్

వివరాలు 2లో..



## రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి మహిళకు రూ.20 వేలు బాకీ పడింది

- కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేని ఎన్నో హామీలు ఇచ్చిందని విమర్శ
- కల్యాణలక్ష్మి, వృద్ధులకు పెన్షన్ వంటి హామీలను అమలు చేయలేదన్న కేంద్రమంత్రి
- ఆర్ఆర్ ట్యాక్స్ విధించి రాహుల్ గాంధీ పర్యటనలకు ఖర్చు చేస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్ పెన్ పవర్:**అధికారంలోకి వచ్చాక మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఈ లెక్కన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి మహిళకు

వివరాలు 2లో..

## ఆ 14 ఉత్పత్తులను దేశవ్యాప్తంగా వెనక్కి తీసుకుంటున్నాం

సుప్రీంకోర్టుకు తెలిపిన పతంజలి





- వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా 14 ఉత్పత్తులపై ప్రకటనలు
- ఇప్పటికే ఆయా ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దు చేసిన ఉత్తరాఖండ్ ప్రభుత్వం
- తాజాగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పతంజలి గ్రూప్

వివరాలు 2లో..

## వచ్చే ఏడాది ఆఖరు కల్లా 'కల్వకుర్తి' పూర్తి

3.40 లక్షల ఎకరాలకు లబ్ధి

యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలన్న సీఎం

గ్రీన్ చానల్ ద్వారా నిధులిస్తం

ప్రతి నెలా సమీక్ష చేయండి

యుద్ధ ప్రాతిపదికన పూర్తి కావాలి

వివరాలు 2లో..




## రష్యా అధ్యక్షుడు పుతిన్ తో చర్చలు ఫలప్రదం అయ్యాయి

రష్యాలో మోదీ పర్యటన

మాస్కోలో పుతిన్ తో సమావేశం

పుతిన్ తో కలిసి ఆటమ్ పెవిలియన్ సందర్శన



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ రష్యాలో పర్యటిస్తున్నా రు. ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో చర్చలు జరి పారు. రష్యా అధ్యక్షు డు పుతిన్ తో సమా వేశం ఫలప్రదంగా జరిగిందని మోదీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. వాణిజ్యం, భద్రత, వ్యవసాయం, టెక్నాలజీ, ఆవిష్కరణలు తదితర రంగాలపై నిర్మాణాత్మక చర్చలు జరిపామని తెలిపారు. ప్రజల మధ్య నేరుగా సంబంధాల వృద్ధికి, అనుసంధానత పెంపుదలకు అధిక ప్రాధాన్యతనిచ్చామని మోదీ వివరించారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని

వివరాలు 2లో..

## రైతులకు గుడ్ న్యూస్ : 2 రోజుల్లో 2 లక్షల రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్.. 2024, ఆగస్ట్ 15వ తేదీలోపు బ్యాంకుల్లోని 2 లక్షల రూపాయల అప్పు మాఫీకి సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాసులరెడ్డి మంచి విషయం చెప్పారు. రుణ మాఫీకి సంబంధించిన విధివిధానాలను 2 రోజుల్లో విడుదల చేస్తున్నామని వెల్లడించారాయన. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా.. జూలై 9వ తేదీ ఈ విషయాన్ని స్పష్టం చేశారాయన. రెండు రోజుల్లో రుణమాఫీ గైడ్లైన్స్ విడుదల చేస్తామన్నారు.

వివరాలు 2లో..

## నేనొక్కడినే చేస్తానని చెప్పడం లేదు... కాంగ్రెస్ నేతల సహకారం తీసుకుంటాను!

రాజకీయ విమర్శలు చేసుకునే సమయం కాదన్న బండి సంజయ్

రాష్ట్రమైనా, కేంద్రమైనా అభివృద్ధి గురించే ఆలోచించాలని సూచన

కొండగట్టును, వేములవాడను కచ్చితంగా అభివృద్ధి చేస్తానని హామీ

అందరం కలిసి ఉందాం.. కలిసే ముందుకు సాగుదామని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి తానొక్కడినే చేస్తానని చెప్పడం లేదని... కాంగ్రెస్ నేతలు, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్, తన లోక్ సభ నియోజకవర్గంలోని అందరు ఎమ్మెల్యేల సహకారంతో ముందుకు సాగుతానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఎన్నికలు పూర్తయ్యాయని...

వివరాలు 2లో..

# రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువా కప్పుతున్నాడు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పార్టీ ఫిరాయింపులపై మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీలు సురేశ్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ అన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం మరింత కఠినతరం చేస్తామన్న కాంగ్రెస్ దానిని గాలికి వదిలేసి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించారు. ఆయారాం... గయారాం సంస్కృతికి శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. 2014 కంటే ముందు ఉమ్మడి ఏపీలో పలుమార్లు ఫిరాయింపులను ప్రోత్సహించిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని తాము పార్లమెంటులో ప్రస్తావిస్తామన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తోందని ఆరోపిస్తోన్న రాహుల్ గాంధీ తెలంగాణలో మాత్రం తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ఏకంగా లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు.
పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఆటోమేటిక్‌గా అనర్హత వేటు వేసేలా పదో షెడ్యూల్‌కు సవరణలు చేస్తామని కాంగ్రెస్ న్యాయ పత్రలో హామీ ఇచ్చి తెలంగాణలో ఫిరాయింపుల ప్రోత్సహిస్తోందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చలేదన్నారు. 2 లక్షల ఉద్యోగాలు, రుణమాఫీ హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను మర్చిపోయి ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలను చేర్చుకుందని ఎద్దేవా చేశారు.
పార్టీ ఫిరాయింపులపై అవసరమైతే రాష్ట్రపతిని, లోక్ సభ స్పీకర్‌ను కలుస్తామన్నారు. సుప్రీంకోర్టులో కేసు వేస్తామన్నారు. రాజ్యాంగ రక్షకుడిగా రాహుల్ గాంధీ ఆస్కార్ అవార్డు స్థాయిలో నటిస్తున్నారని... ఆచరణలో రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒక్కో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కొనడానికి ఎంత ఖర్చు పెడుతున్నారని అంటూ మండిపడ్డారు.

# సంపాదకీయం

## వర్షాలు పడుతున్నాయ్..

### ఈ జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం లేదంటే..!

భారీ వర్షా లే కాదు... చిన్నచిన్న తుంపర్లు పడుతున్నా... ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగే నీటి దగ్గరి నుంచి... అన్నింట్లోనూ ఆచితూచి వ్యవహరించాలి. మరి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే... ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చో తెలుసుకుందాం.

**సమస్యలు...**

వర్షాలు పడినప్పుడు ఇంటి పరిసర ప్రాంతాల్లో అంటే గుంతల్లో, రోడ్ల మీద, బయట పాత సామాన్లలో నీళ్లు నిలుస్తాయి. అలాంటి చోట దోమలు ఎక్కువగా చేరి... వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉంది. ౖ అలాగే ఈ కాలంలో ఎగ్జిమా, యాక్నె, సోరియాసిస్ వంటి దీర్ఘకాలిక సమస్యలు తీవ్రంగా మారే అవకాశాలు ఉంటాయి. ఆరోగ్యంగా ఉండేందుకు చిట్కాలు...

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు వైరల్ ఇన్ఫెక్షన్లు, చర్మ సమస్యలు ఎక్కువగా వస్తాయి. అలా జరగకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ.. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి. ౖ స్ట్రీట్ ఫుడ్ ఎక్కువగా తినేవాళ్లు... ఈ కాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీలైనంత వరకు బయట తినడం మానేయాలి. అంతేకాదు... బయట కొన్న పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగాకే తినాలి.

దోమల వల్ల వ్యాపించే వ్యాధుల నుంచి రక్షించుకోవాలంటే రోజూ చేతులు, కాళ్లకు ఇన్సెక్ట్ రెపెల్లెంట్ రాసుకోవాలి. అలాగే యాంటీ మలేరియా మందులను కూడా తీసుకోవడం మంచిది. వీలైనంత వరకు మురికి నీళ్లు ప్రవహించే చోటికి వెళ్లకపోవడం మేలు.

వానలో తడిస్తే ఇంటికి రాగానే... తడిగా ఉన్న బట్టలు, సాక్స్ ని విడవాలి. కాళ్లను నీళ్లతో కడిగి తుడుచుకోవాలి.

వర్షంలో తడిచాక స్నానం చేయడం తప్పనిసరి.

మార్కెట్ లో దొరికే యాంటీ బ్యాక్టీరియల్ సబ్బుని వాడాలి. అలా చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి.

శరీరాన్ని వెచ్చగా, పొడిగా ఉంచుకుంటే... జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవచ్చు.

ఏసీ ఉన్న రూముల్లోకి తడి జుట్టు, దుస్తులతో వెళ్లొద్దు.

ఈ కాలంలో ఎప్పుడూ కాస్తంత వదులుగా ఉన్న కాటన్ దుస్తులే వేసుకోవాలి. వీలైనంత వరకు సింథటిక్ ఫైబర్కు దూరంగా ఉండాలి.

చర్మంపై చెమట, తేమ పేరుకుపోకుండా యాంటీ ఫంగల్ పౌడర్ను వాడాలి. ఏదైనా ఇన్ ఫెక్షన్తో బాధపడుతున్నట్లైతే.... డాక్టర్ల సలహా మేరకు మెడికల్ పౌడర్లను ఉపయోగించాలి.

ఆస్తమా, డయాబెటిస్ బాధితులు... చినుకులు పడుతున్న కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ౖ క్రమం తప్పకుండా రెగ్యులర్ వాడే మందులతో పాటు వ్యాక్సినేషన్ తీసుకోవాలి.

మామూలు టీ కంటే హెర్బల్ టీ తాగడం మంచిది. అలాగే వేడి చేసి, చల్లార్చిన నీళ్లన తాగాలి.

విటమిన్–సి ఉన్న కూరగాయలు, పండ్లను తరచూ తీసుకోవాలి. అవి రోఘనిరోధకశక్తిని పెంచుతుంది. ౖ పిల్లల చర్మం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. మృదువుగా, సున్నితంగా ఉండే పిల్లల చర్మానికి డాక్టర్ల పర్యవేక్షణలో మాయిశ్చరైజర్ వాడాలి.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి మహిళకు రూ.20 వేలు బాకీ పడింది

- మొదటి పేజీ తరువాయి

రూ.20 వేలు బాకీ పడ్డారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేని ఎన్నో హామీలు ఇచ్చిందని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలని నిలదీశారు. కల్యాణలక్ష్మి కింద రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని కూడా చెప్పారని... కానీ ఇంతవరకు ఇచ్చింది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి... బస్సులను తగ్గించారని ఆరోపించారు. తెలంగాణలో మహిళలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని... అందుకే వారి తరఫున ప్రశ్నించే బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. హామీల అమలు కోసం ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెస్తామని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను పక్కన పెట్టేసిందని విమర్శించారు.
తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ విధించి... రాహుల్ గాంధీ పర్యటనల కోసం ఆ పన్నులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలన్నారు. అసలు పథకాల పేరుతో తెస్తోన్న అప్పులను ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. మహిళలపై ముఖ్యమంత్రికి ఏమాత్రం గౌరవం ఉన్నా బెల్ట్ దుకాణాలు మూసేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లైనా
కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని గుర్తు చేశారు. దీంతో మహిళలు గ్యాస్ కనెక్షన్లు తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేమిటని ప్రశ్నించారు. తెల్ల రేషన్ కార్డు వున్న ప్రతి ఒక్కరికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే బియ్యం ఇస్తోందన్నారు.

## త్వరలో కాంగ్రెస్‌లోకి 20 మంది ఎమ్మెల్యేలు

- మొదటి పేజీ తరువాయి

ఆ సంపదతోనే ప్రధాని కావాలని కలలు కన్నారని అన్నారు. కేసీఆర్ తెలంగాణతో పేగుబంధాన్ని తెంచుకున్నారని విమర్శించారు. విభజన సమస్యలను పరిష్కరించే దిశగా సీఎం రేవంత్ ముందుకెళ్తున్నారని ఐలయ్య చెప్పారు. ఏపీ సీఎం బాబుతో భేటీ అయ్యారని అన్నారు.

## వచ్చే ఏడాది ఆఖరు కల్లా 'కల్వకుర్తి' పూర్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేసి నీరందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లాలలో రూ.396 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పాలమూరు వర్సిటీ ఎస్టీపీ, అకడమిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్, మహబూబ్‌నగర్ రూరల్, గండీడ్ కేజీవీబీ భవన నిర్మాణాలకి శంకుస్థాపన చేశారు. అనంతరం మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 3.40 లక్షల ఎకరాలకు నీరందించే ఈ జలాశయాన్ని పూర్తి చేసి బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఫీల్డ్ విజిట్ చేసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి నెలా ప్రాజెక్టుల్లో పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలని సీఎం ఆదేశించారు. అలాగే సాగునీరు, విద్య, వైద్యం, పలు అంశాలపై చర్చించారు. సీఎం ఆదేశాలతో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు కూడా పరుగులు పెట్టనున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొత్తగా రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# నేనొక్కడినే చేస్తానని చెప్పడం లేదు... కాంగ్రెస్ నేతల సహకారం తీసుకుంటాను!

- మొదటి పేజీ తరువాయి

రాజకీయ విమర్శలు చేసుకునే సమయం అయిపోయిందన్నారు. వేములవాడ నియోజకవర్గంలో తనను గెలిపించినందుకు ఆయన కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అందరి సహకారంతోనే అభివృద్ధి పనులు సాధ్యమవుతాయన్నారు. తాను కేవలం పేరు కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. ఇప్పుడు రాజకీయాలు చేయవద్దని... రాష్ట్రమైనా, కేంద్రమైనా ఇప్పుడు అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచించాలని సూచించారు. ఏ పదవి వచ్చినా తనకు గర్వం, అహంకారం ఉండవన్నారు. తనకు వచ్చిన పదవిని ఒక గొప్ప బాధ్యతగా తాను భావిస్తానన్నారు. కొండగట్టును, వేములవాడను కచ్చితంగా అభివృద్ధి చేస్తానన్నారు. కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న... వీరు కోరిన కోర్కెలు తీర్చే దేవుళ్లని... పక్క రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు వస్తారని పేర్కొన్నారు. ఆలయం అభివృద్ధికి కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. తాను ఎప్పుడూ పేరు కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. ఇతర పార్టీల సహకారం కూడా తీసుకుంటానని.. కానీ తానొక్కడినే చేస్తానని ఎప్పుడూ చెప్పడం లేదన్నారు.
మనం చేసిన పనిని ప్రజలు గుర్తించాలని మంత్రి అన్నారు. తాను ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని వచ్చిన వ్యక్తినన్నారు. అన్ని పార్టీల నాయకులకు ఓ విజ్ఞప్తి చేస్తున్నానని... అందరం కలిసి ఉందామని, కలిసే ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారం కోసమో... ఎన్నికల్లో గెలవడం కోసమో... అధినాయకత్వం మన్నన పొందేందుకో... మనం పని చేయకూడదన్నారు. మనల్ని గెలిపించిన ప్రజలకు మనం సేవ చేయాలన్నారు.

## ఆ 14 ఉత్పత్తులను దేశవ్యాప్తంగా వెనక్కి తీసుకుంటున్నాం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్ ఆధ్వర్యంలోని పతంజలి సంస్థ 14 రకాల ఉత్పత్తులకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు విచారణ ఎదుర్కొంటోంది. తాజాగా ఈ కేసులో పతంజలి సంస్థ అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. మాన్యుఫ్యాక్చరింగ్ లైసెన్స్ రద్దు అయిన ఆ 14 ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేశామని కోర్టుకు విన్నవించింది. అంతేకాకుండా, ఇప్పటికే మార్కెట్ లో ఉన్న ఆ ఉత్పత్తులను వెనక్కి తీసుకునే ప్రక్రియ కూడా ప్రారంభించామని, ఆ మేరకు తమ ఫ్రాంఛైజీ స్టోర్లకు సమాచారం అందించామని వివరించింది. ముఖ్యంగా, ఆయా ఉత్పత్తుల వాణిజ్య ప్రకటనలను కూడా వెనక్కి తీసుకుంటున్నట్టు మీడియా సంస్థలకు సమాచారం ఇచ్చామని పతంజలి సంస్థ తమ అఫిడవిట్ లో పేర్కొంది. పతంజలి సంస్థ 14 రకాల ఉత్పత్తుల విషయంలో వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చినట్టు తేలడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇప్పటికే ఆయా ఉత్పత్తుల తయారీ లైసెన్స్ లు రద్దు చేసింది.

# మళ్లీ టీఆర్ఎస్! బీఆర్ఎస్ నేమ్ చేంజ్

- మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలకు పైగా కలిసొచ్చిన టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం ద్వారా ప్రజలతో గ్యాప్ ఏర్పడిందని పార్టీ నాయకత్వం భావిస్తున్నదని సమాచారం. ఇవాళ ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలోనూ మాజీ మంత్రి కేటీఆర్ ఇదే అంశాన్ని ప్రస్తావించారు.

**సెంటి'మంట'రగిలించి..**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన టీఆర్ఎస్.. మళ్లీ సెంటిమెంట్ రగిలించాలనే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రజలతో ఏర్పడ్డ గ్యాప్ ను ఫిల్ చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది.
తాము చేసిన అభవృద్ధి కన్నా సెంటిమెంటే విజయతీరాలకు నడిపిస్తుందని
గులాబీబాస్ గట్టిగా నమ్ముతున్నారని సమాచారం. బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చడం ప్రజలు పార్టీని ఓన్ చేసుకుంటారని కేసీఆర్ అనుకుంటున్నారని తెలుస్తోంది. విభజన అంశాలను, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తెరమీదకు తెచ్చి పార్టీని ప్రజల్లో ఉంచేందుకు టీఆర్ఎస్ గా మార్చడమే ఏకైక పరిష్కారమని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## రష్యా అధ్యక్షుడు పుతిన్ తో చర్చలు ఫలప్రదం అయ్యాయి

- మొదటి పేజీ తరువాయి


ప్రఖ్యాత ఆటమ్ పెవిలియన్ ను పుతిన్ తో కలిసి సందర్శించినట్టు మోదీ వెల్లడించారు. భారత్, రష్యా మధ్య సహకారానికి ఇంధన రంగం మూలస్తంభం వంటిదని తెలిపారు. ఈ రంగంలో ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతం చేసుకునేందుకు మరింత ఆసక్తిగా ఉన్నామని పేర్కొన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే శాంతి చాలా ముఖ్యమని, అయితే, యుద్ధాల ద్వారా శాంతి లభించదని స్పష్టం చేశారు. యుద్ధాల ద్వారా సమస్యలకు పరిష్కారాలు లభించవని... బాంబులు, తుపాకీ మోతల మధ్య జరిగే చర్చలు ఫలించవని అభిప్రాయపడ్డారు. చర్చల ద్వారా శాంతిస్థాపనకు ప్రయత్నించాలని మోదీ ఓ సందేశంలో పేర్కొన్నారు.

## మహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం: రేవంత్ రెడ్డి

### ఉదయం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సిరాజ్

### హైదరాబాద్ పరిసరాల్లో ఇంటి స్థలం గుర్తించాలని ఆదేశాలు

### టీ ప్రపంచకప్ సాధించిన టీమ్‌లో సిరాజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్ నగరంలో ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని సిరాజ్ ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా క్రికెటర్‌కు ఇంటి స్థలంపై ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇంటి స్థలం గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఇంకా కుట్రలు చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయన్నారు.
ఈ ఎన్నికల్లో కార్యకర్తలనే ఎంపీటీసీలుగా, సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల నామినేటెడ్ పోస్టుల్లో నిజమైన పార్టీ కార్యకర్తలకు న్యాయం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడేవారికి పదవులు ఇవ్వాలన్నారు. వారివల్లే తాము ఇక్కడ కూర్చున్నామని వ్యాఖ్యానించారు. పంద్రాగస్ట్ లోగా రుణమాఫీ చేస్తామని పునరుద్ఘాటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నట్లు చెప్పారు. సంవత్సరం లోపే మన ప్రభుత్వం ఎన్నో పనులు చేస్తుంటే... బీఆర్ఎస్ మాత్రం కుట్రలు చేస్తోందన్నారు. కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ఉసురు తగిలిందన్నారు. ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను చేర్చుకున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కాంగ్రెస్ కార్యకర్తలను హింసించారని... దాడులు జరిగిన సమయంలో కేసీఆర్ చెబుతున్న రాజనీతి ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. తన వరకు వస్తే గానీ కేసీఆర్‌కు బాధ తెలియడం లేదన్నారు. కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు.

## రైతులకు గుడ్ న్యూస్ : 2 రోజుల్లో 2 లక్షల రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల

- మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 15 లోగా పూర్తి చేస్తము..నిధుల సమీకరణ స్టార్ట్ అయింది..రేపు రైతు భరోసా పై ఖమ్మం లో అభిప్రాయం సేకరణ స్టార్ట్ చేస్తున్నాము..రైతులు, ఉద్యోగులు, మేధావులు, రైతు సంఘాల నేతలు అభిప్రాయం లు తీసుకుంటున్నాము.. నేను ఇంత వరకు రైతు బంధు తీసుకోలేదు చెక్ లు ఇచ్చిన తిరిగి ఇచ్చానని చెప్పారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# వంట గ్యాస్ ఈకేవైసీ డెడ్ లైన్ గడువుపై క్లారిటీ ఇచ్చిన కేంద్రమంత్రి

ఏజెన్సీల వద్ద మాత్రమే ఈకేవైసీ నమోదు చేయాలన్న వాదన పైనా క్లారిటీ

ఈకేవైసీకి తుది గడువు లేదన్న కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరి

ఈకేవైసీ గ్యాస్ ఏజెన్సీల వద్దనే చేసుకోవాలనేమీ లేదని వెల్లడి

కేవైసీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎలాంటి తుది గడువు లేదని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్యాస్ వినియోగదారుల ఈకేవైసీ గడువు, ఇతర అంశాలపై కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరి మంగళవారం స్పష్టతనిచ్చారు. కొన్ని నెలలుగా గ్యాస్ కంపెనీలు ఈకేవైసీని చేపడుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల వద్ద మాత్రమే ఈకేవైసీ నమోదు చేయాలని కొన్ని కంపెనీలు పట్టుబడుతున్నాయంటూ కేరళ శాసన సభ ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ కేంద్రమంత్రికి లేఖ రాశారు. ఈ లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. బోగస్ కస్టమర్లను తొలగించేందుకే చమురు మార్కెటింగ్ సంస్థలు ఈకేవైసీ ఆధార్ అథెంటికేషన్ ప్రక్రియను చేపడుతున్నాయని తెలిపారు. గత ఎనిమిది నెలలుగా ఇది కొనసాగుతోందన్నారు. ఎల్పీజీ డెలివరీ సిబ్బంది గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేసే సమయంలోనే కస్టమర్ల వివరాలను వెరిఫై చేస్తారని తెలిపారు. వారి మొబైల్ ఫోన్లలోని యాప్‌తో వినియోగదారుల ఆధార్ వివరాలను నమోదు చేసుకొని ఈ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. అలాగే, కస్టమర్లు తమ సౌలభ్యం మేరకు దగ్గరలోని డిస్ట్రిబ్యూటర్ షోరూంకు వెళ్లి కూడా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చునని తెలిపారు. అలాగే, చమురు మార్కెటింగ్ సంస్థల యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని సొంతంగా కేవైసీని అప్ డేట్ చేసుకోవచ్చని వివరించారు. కేవైసీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎలాంటి తుది గడువు లేదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. చమురు సంస్థలు లేదా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి తుది గడువు విధించలేదన్నారు. ఎల్పీజీ ఏజెన్సీలలోనే ఈకేవైసీని పూర్తి చేయాలనే కచ్చితమైన నిబంధన ఏదీ లేదన్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్న మంత్రి

రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి

వివిధ రకాల ఆహార పదార్థాలతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్న మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మంత్రి సీతక్క మంగళవారం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ... గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్థానికంగా మొత్తం నాలుగు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మొదటి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలన్నారు. నాణ్యతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

# కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచన

క్షేత్రస్థాయిలో పరిశీలించి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలన్న రేవంత్ రెడ్డి

గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదలకు సిద్ధమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌పై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతి నెలా ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై సమీక్ష నిర్వహించాలన్నారు.


# హరీశ్ రావు, కేటీఆర్‌లకు ఢిల్లీలో ఏం పని?: కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

బీఆర్ఎస్ నుంచి 25 మంది కాంగ్రెస్‌లో చేరుతారన్న బీర్ల ఐలయ్య

త్వరలోనే బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనమవుతుందని జోస్యం

రేవంత్ రెడ్డి పాలన నచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న ఎమ్మెల్యే

గల్లీలో మొహం చెల్లక ఢిల్లీకి వెళ్లి మాట్లాడుతున్నారని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** రేవంత్ రెడ్డి పాలన నచ్చి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ నుంచి 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి వస్తారని జోస్యం చెప్పారు. త్వరలోనే బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారడం... బీఆర్ఎస్ చేస్తే సంసారం... తాము చేస్తే వ్యభిచారమా? అని ప్రశ్నించారు. తాము ఫిరాయింపులకు పాల్పడటం లేదన్నారు. కాంగ్రెస్ పాలన నచ్చి వారు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. తాము ప్రలోభాలు పెట్టి ఎమ్మెల్సీలను తీసుకోవడం లేదని పేర్కొన్నారు. గల్లీలో మొహం చెల్లని బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు హరీశ్ రావు, కేటీఆర్‌లకు ఢిల్లీలో ఏం పని? అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీకి ఢిల్లీలో ఏం పని ఉందో చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకే కేటీఆర్, హరీశ్ రావులు ఢిల్లీకి వెళ్లారని ఆరోపించారు. చివరికి బీఆర్ఎస్ పార్టీలో మిగిలేది నలుగురేనని... మిగిలిన ఆ నలుగురు పాడె మోస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. గడీల పాలన చేసినందువల్లే... ఆ గడీలను బద్దలుకొట్టి ప్రజాపాలన తెచ్చామన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్, సురేష్ రెడ్డిలకు ఏమాత్రం బుద్ధి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర పెట్టి కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను ఊరూరా చెప్పాలన్నారు.

# జేఎన్టీయూలో చట్నీలో ఎలుక ఘటన... మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం

ఘటనకు సంబంధించి తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశం

తెలంగాణవ్యాప్తంగా క్యాంటీన్లలో తనిఖీ చేయాలని ఆదేశాలు

జేఎన్టీయూ వంటగదిని పరిశీలించిన అదనపు కలెక్టర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్‌లో చట్నీలో ఎలుక రావడంపై మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లో ఈ కాలేజీ ఉంది. ఈ ఘటనకు సంబంధించి తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంగారెడ్డి అదనపు కలెక్టర్, ఆర్డీవో, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, క్యాంటీన్లలో తనిఖీలు చేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలను తయారు చేసే నిర్వాహకులు ఎఫ్ఎస్ఎస్ఏఐ (%ఖీూూా×%) లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన ఆహారం ఉండేలా... ఫుడ్ సేఫ్టీ అధికారులు నిత్యం హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాంటీన్లు, ఆహార పదార్థాలు తయారు చేసే నిర్వాహకులపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

**వంటగదిని పరిశీలించిన అదనపు కలెక్టర్**

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి జేఎన్టీయూ క్యాంపస్‌లోని వంట గదిని పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా కనిపించడంతో ప్రిన్సిపల్, సిబ్బంది, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మెస్ కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. విద్యార్థులను కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని వడ్డించాలని సూచించారు. ?

# చట్నీ గిన్నెలో చిట్టెలుక.. జేఎన్‌టీయూ క్యాంటీన్‌లో షాకింగ్ ఘటన!

- సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో ఉన్న జేఎన్‌టీయూ కాలేజీ క్యాంటీన్‌లో ఘటన
- చట్నీ గిన్నెపై మూత పెట్టకపోవడంతో అందులో పడ్డ ఎలుక
- చట్నీలో ఎలుకను గమనించి వీడియో తీసి నెట్టింట పెట్టిన విద్యార్థులు
- చట్నీలో ఎలుక పడలేదంటూ కాలేజీ ప్రిన్సిపల్ నరసింహ వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో ఉన్న జేఎన్‌టీయూ కాలేజీ క్యాంటీన్‌లో చిట్టెలుక కలకలం సృష్టించింది. ఇంజినీరింగ్ హాస్టల్‌లో ఉన్న క్యాంటీన్‌లో చట్నీ గిన్నెపై మూత పెట్టకపోవడంతో అందులో ఎలుక పడింది. అయితే చట్నీలో ఎలుకను గమనించిన విద్యార్థులు క్యాంటిన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిని వీడియో తీసి నెట్టింట పోస్టుచేశారు. కాగా, ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపల్ నరసింహ స్పందించారు. చట్నీలో ఎలుక పడలేదని చెప్పారు. శుభ్రం చేసేందుకు ఉంచిన పాత్రలో ఎలుక కనిపించిందని తెలిపారు. కొందరు విద్యార్థులు కావాలనే వీడియో తీసి ప్రజాప్రతినిధులకు పంపించారని ఆరోపించారు.కాగా, గత నెల 24న కూడా కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఇలాంటి ఘటనే చోటుచేసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు దర్శనమివ్వడంతో ఆందోళనకు దిగారు. తాము రోజూ తినే ఆహారంలో పురుగులు వస్తుంటే వర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వీసీ చాంబర్ ముందు ఆందోళనకు దిగారు.

# ప్రపంచంలోని అతిపెద్ద క్రిమినల్‌ను మోదీ ఆలింగనం చేసుకోవడం చాలా నిరాశను కలిగించింది: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

రష్యా పర్యటనలో ప్రధాని మోదీ బిజీ

మోదీ, పుతిన్ భేటీపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆగ్రహం

ఇది శాంతి ప్రయత్నాలకు పెద్ద దెబ్బ అని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటన కోసం ఆయన సోమవారం రష్యా వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ప్రధాని మోదీ కౌగిలించుకోవడంపై ఉక్రెయిన్ ప్రెసిడెంట్ వోలోడిమిర్ జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాని అయిన మోదీ ప్రపంచంలోని అతిపెద్ద క్రిమినల్‌ను ఆలింగనం చేసుకోవడం చాలా నిరాశను కలిగించిందని అన్నారు. ఈ భేటీని ఆయన తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో తీవ్రంగా ఖండించారు. మరోవైపు అదేరోజు రష్యా మిస్సైల్ దాడిలో 37 మంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు."ఇవాళ ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడికి పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు చిన్నారులు సహా 37 మంది చనిపోయారు. 13 మంది పిల్లలు సహా 170 మంది గాయపడ్డారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులు చికిత్స పొందుతున్న ఉక్రెయిన్‌లోని అతిపెద్ద పిల్లల ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకుని రష్యా క్షిపణి దాడి చేసింది. ఇలాంటి రోజున ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య నేత మాస్కోలో ప్రపంచంలోని అతిపెద్ద క్రిమినల్‌ను కౌగిలించుకోవడం చాలా నిరాశకు గురి చేసింది. ఇది శాంతి ప్రయత్నాలకు పెద్ద దెబ్బ" అని జెలెన్‌స్కీ చెప్పుకొచ్చారు. కాగా, గత నెలలో ఇటలీలో జరిగిన 'జీ7' శిఖరాగ్ర సదస్సులో జెలెన్‌స్కీని మోదీ కలిశారు. ఆ సమయంలో ఉక్రెయిన్ వివాదంపై శాంతియుత పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందని, అలాగే దౌత్యపరంగా కూడా సహకారాన్ని కొనసాగిస్తామని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. కానీ, ఇప్పుడు పుతిన్‌తో భేటీ కావడంపై జెలెన్‌స్కీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# యూపీలో భార్యాభర్తల మధ్య చిచ్చుపెట్టిన 'ఆవాస్ యోజన' డబ్బులు!

యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలోనే 11 కేసుల నమోదు

మొదటి విడతగా రూ.40 వేలు మంజూరు చేసిన ప్రభుత్వం

ఇదే సమయంలో ప్రియులతో వెళ్లిన వివాహితలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వచ్చిన ఆర్థిక సాయం అందుకున్న తర్వాత పలువురు మహిళలు... తమ భర్తను వదిలి ప్రియుడితో వెళ్లిపోతున్నారట. ఇందుకు సంబంధించి ఉత్తర ప్రదేశ్‌లో పదికి పైగా ఘటనలు చోటు వెలుగు చూశాయి. పేదల సంక్షేమంలో భాగంగా పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం కింద మొదటి విడత సాయం పొందిన యూపీకి చెందిన వివాహితలు... ఆ తర్వాత నచ్చినవారితో పారిపోయినట్లు వెల్లడైంది. యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలో ఇటీవల 2,350 మందికి ఈ పథకం కింద నగదు విడుదలైంది. తొలి విడతగా రూ.40 వేల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యింది. అయితే, ఇదే సమయంలో తమ భార్యలు వేరేవారితో వెళ్లిపోయారని పోలీసులకు కొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ ఒక్క జిల్లాలోనే ఇలాంటివి 11 కేసులు నమోదయ్యాయి. దీంతో రెండో విడత నగదును నిలిపివేయాలని నిర్ణయించినట్లుగా అధికారులు తెలిపారు.

# జస్ప్రీత్ బుమ్రాకు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు

## జూన్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా బుమ్రా

## రోహిత్ శర్మ, రహ్మానుల్లా గుర్బాజ్‌ను అధిగమించి అవార్డు గెలుచుకున్న వైనం

## ఇది తనకు ప్రత్యేక గౌరవమన్న జస్ప్రీత్ బుమ్రా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలిచిన భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు తాజాగా మరో అవార్డు దక్కింది. జూన్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును అతడు సొంతం చేసుకున్నాడు. ఇక ఈ అవార్డు కోసం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన స్టార్ ప్లేయర్ రహ్మానుల్లా గుర్బాజ్ కూడా పోటీ పడ్డారు. కానీ, వారిద్దరినీ అధిగమించి బుమ్రా అవార్డు దక్కించుకోవడం విశేషం. కాగా, టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ఆసాంతం ఈ స్టార్ పేసర్ అద్భుతంగా రాణించాడు. తద్వారా టీమిండియా టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు.

బార్బడోస్‌లో జరిగిన ఫైనల్‌లో చివరి ఐదు ఓవర్లలో రెండు ఓవర్లు బౌలింగ్ చేసిన బుమ్రా కేవలం ఆరు పరుగులు మాత్రమే ఇచ్చి కీలకమైన ఒక వికెట్ కూడా తీశాడు. మొత్తంగా టోర్నమెంట్‌లో 4.17 ఎకనామీ, 8.26 సగటుతో 15 వికెట్లు పడగొట్టాడు. దాంతో అత్యుతమ గణాంకాలు నమోదు చేసినందుకు గాను అతనికి ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు దక్కింది.

**ఇది నాకు ప్రత్యేక గౌరవం: బుమ్రా**

"జూన్ నెలలో ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికైనందుకు చాలా సంతోషం. అమెరికా, వెస్టిండీస్‌లో గడిపిన కొన్ని వారాలు ఎంతో చిరస్మరణీయం. ఆ తర్వాత నాకు ఇది ప్రత్యేక గౌరవం. జట్టుగా జరుపుకోవడానికి చాలా ఉంటాయి. కానీ, ఈ వ్యక్తిగత ప్రశంస ఎప్పటికీ ప్రత్యేకమే. టోర్నీలో అద్భుత ప్రదర్శన చేయడం, జట్టు ట్రోఫీ గెలవడం చాలా ఆనందంగా ఉంది. చివర్లో ట్రోఫీ ఎత్తడం చాలా ప్రత్యేకమైంది. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ నాతో ఉంచుకుంటాను. ఇక జూన్ నెలలో ఈ అవార్డు కోసం పోటీ పడ్డ రోహిత్, గుర్బాజ్‌కు నా అభినందనలు. చివరిగా నా కుటుంబ సభ్యులకు, నా సహచరులు, కోచ్‌లతో పాటు అభిమానులు నాకు ఓటు వేసినందుకు ధన్యవాదాలు. వారి మద్దతు ఎప్పటికీ మరిచిపోలేను" అని జస్ప్రీత్ బుమ్రా చెప్పుకొచ్చాడు.

# రాహుల్ ద్రవిడ్‌తో కేకేఆర్ సంప్రదింపులు.. ఏ రోల్ కోసమో తెలుసా?

## టీమిండియా హెడ్ కోచ్‌గా ముగిసిన ద్రవిడ్ పదవీ కాలం

## దీంతో అతని కోసం పోటీ పడుతున్న కొన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలు

## అన్ని ఫ్రాంచైజీల కన్నా ముందుగా కేకేఆర్ సంప్రదించినట్లు వార్తలు

## మెంటార్‌గా బాధ్యతలు తీసుకోవాలని ద్రవిడ్‌ను కోరిన నైట్‌రైడర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ టీ20 వరల్డ్‌కప్‌తో టీమిండియా కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవి కాలం ముగిసిన విషయం తెలిసిందే. దీంతో ద్రవిడ్ పై కొన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలు కన్నేశాయని సమాచారం. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందే అతడిని ఎలాగైనా దక్కించుకోవాలని కొన్ని ఫ్రాంచైజీలు చూస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ్ కోసం సదరు ఫ్రాంచైజీలు విపరీతంగా పోటీ పడుతున్నట్లు తెలిసింది. కోచ్‌గా లేదా మెంటార్‌గా జట్టులోకి తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. అయితే, న్యూస్ 18 బంగ్లా ప్రకారం, ద్రవిడ్ కోసం అన్ని ఫ్రాంచైజీల కన్నా ముందుగా కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్) సంప్రదించిందని సమాచారం. కోచ్‌గా కాకుండా మెంటార్‌గా బాధ్యతలు తీసుకోవాలని ద్రవిడ్‌ను కేకేఆర్ కోరిందని తెలుస్తోంది. 2024 ఐపీఎల్ సీజన్‌లో జట్టును విజేతగా నిలిపిన కేకేఆర్ జట్టు మెంటార్ గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయమైంది. దాంతో అతని స్థానంలో ద్రవిడ్‌ను మెంటార్‌గా నియమించాలని కేకేఆర్ భావిస్తోంది. గౌతీ ఇప్పటికే శిబిరాన్ని విడిచిపెట్టడంతో నైట్ రైడర్స్ అతని వారసుడిగా ద్రవిడ్‌ను నియమించాలని యోచిస్తోంది. గౌతం గంభీర్ మొదట లక్నో సూపర్ జెయింట్స్ కోచ్, మెంటార్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మెంటార్‌గా వచ్చాడు. వస్తూవస్తూనే ఆ జట్టు ఐపీఎల్ 2024లో టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక టీమిండియా హెడ్ కోచ్‌గా ద్రవిడ్ ఎన్నో ఘనతలు సాధించిన సంగతి తెలిసిందే. 2022 టీ20 ప్రపంచ కప్‌లో సెమీస్‌కు వెళ్లిన భారత జట్టు, 2023 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు, 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరింది. ఇక ఇటీవల జరిగిన 2024 టీ20 వరల్డ్‌కప్‌లో విజేతగా నిలిపారు. ఈ విజయంలో రాహుల్ ద్రవిడ్‌ది ప్రధాన పాత్ర అని చెప్పొచ్చు. ఈ విషయాన్ని కోహ్లీ, రోహిత్ కూడా చెప్పారు. అందుకే ఇప్పుడు ద్రవిడ్ టీమిండియా కోచ్ పదవికి గుడ్‌బై చెప్పడంతో అతడిపై ఐపీఎల్ ఫ్రాంచైజీలు కన్నేశాయి.

# జింబాబ్వేలో వైల్డ్ లైఫ్ టూర్ తో సేదదీరిన టీమిండియా ఆటగాళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదు టీ20 మ్యాచ్ ల సిరీస్ కోసం జింబాబ్వేలో పర్యటిస్తున్న టీమిండియా ఆటగాళ్లు, వారి కుటుంబ సభ్యులు ఆట విడుపు కోసం స్థానిక అభయారణ్యాలను సందర్శించారు. ఈ సిరీస్ లో ఇప్పటికే రెండు మ్యాచ్ లు జరిగాయి. మూడో మ్యాచ్ ఈ నెల 10న జరగనుంది. ఈ మధ్యలో విరామం రావడంతో... టీమిండియా ఆటగాళ్లు, వారి కుటుంబ సభ్యుల కోసం బీసీసీఐ... జింబాబ్వే క్రికెట్ బోర్డు, జింబాబ్వే టూరిజం శాఖతో కలిసి ఈ వైల్డ్ లైఫ్ టూర్ ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన ఫొటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది.



# వామికా గబ్బి స్టైలిష్ లుక్స్



# రెజీనా స్టైలిష్ లుక్ కుర్రాళ్లలో కాక పుట్టించేలా!



చెన్నై సోయగం రెజీనా సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో కొంగొత్తగా కుర్రాళ్లని ఆకర్షిస్తుంటుంది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదైన మార్క్ తప్పనిసరని ప్రూవ్ చేసిన సంద ర్భాలెన్నో. తమిళ సోయగాల్లో తానో స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. బేసిక్ గా కోలీవుడ్ భామలు గ్లామర్ షోకి కొన్ని పరిమితలంటూ మెయింటెన్ చేస్తుంటారు. కానీ రెజీనా మాత్రం ఆ విషయంలో బాలీవుడ్ భామలకే ధీటుగా నిలుస్తుంది. ఆరంభంలో మడికట్టి కూర్చున్నా! కాలక్రమంలో ట్రెండ్ ని ఫాలో అవుతూ డిజైనర్ దుస్తుల్లో ట్రెండ్ నే సృష్టించే స్థాయికి ఎదిగింది. చేతిలో సక్సెస్ లున్నా లేకపోయినా ఇప్పటికీ మార్కెట్ లో బ్రాండ్ గా కొనసాగుతుందంటే?ఆ క్వాలిటీ కూడా ఓ కారణంగా చెప్పొచ్చు. తాజాగా మరో ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బ్లూ అండ్ వైట్ కాంబినేషన్ లో అమ్మడి స్టైలిష్ లుక్ ఇంట్రెస్టింగ్. అమ్మడు టాప్ టూ బాటమ్ ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ మరింత స్టైలిష్ గా తీర్చిదిద్దాయి. హైహీల్స్ ని తలపించేలా షూస్ ధరించింది. నడి నెత్తిన స్పాట్ లైట్..బ్యాక్ గ్రౌండ్ బ్యూటీ ప్రతీది రెజీనా బ్యూటీని ఫోకస్ చేస్తున్నాయి. వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులు నెట్టింట వైరల్ గా మారాయి. %-%వాట్ ఈజ్ యుర్ టైప్%-% అంటూ ఫోటోని ఉద్దేశించి ఓ క్యాప్షన్ కూడా పోస్ట్ చేసింది. దీంతో కామెంట్ బాక్సులో నెటి జనుల పోస్టులు అంతే ఇంట్రెస్టింగ్ గా కనిపిస్తున్నాయి. లుక్స్ గార్జియస్...సో బ్యూటీఫుల్ అంటూ అమ్మడి అందాన్ని పొగడ్తలతో రెట్టింపు చేసేస్తున్నారు.ఇక రెజీనా సినిమాల సంగతి చూస్తే జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తోంది. గతేడాది మూడు రిలీజ్ లతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంతకు ముందు ఏడాది నాలుగు రిలీజ్ లతో థియేటర్లో కనిపించింది. మరి ఇందులో విజయాలు ఎన్ని అంటే బూతద్దం పెట్టి వెతికినా విజయం కనిపించదు. కానీ 2024 లో మాత్రం ఫుల్ బిజీగా ఉంది. గత రెండు సంవత్సరాలకంటే ఎక్కువ సినిమాలే కమిట్ అయింది. అవన్నీ ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

# మానుషి దుస్తుల స్విచ్-అప్ బ్లేజ్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com